స్వామి వివేకానంద బోధనలు ఆదర్శనీయం



మెమొంటో అందజేస్తున్న స్వామి బోధమయానంద

కవాడిగూడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద బోధనలు ఆదర్శనీయమని, నేటి యువతకు దశ దిశ చూపుతాయని రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద అన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని స్వామి వివేకానంద ఆడిటోరియంలో రామకృష్ణ మఠ్, వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్సీ ఆధ్వర్యంలో గురువారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు, ఫౌండర్ సీఈవో సెక్యూరిటీ గ్లోబల్ పాట్నా శరత్ వివేక్‌సాగర్, రామకృష్ణ మఠంఅధ్యక్షుడు స్వామి బోధమయానందలు హాజరై జ్యోతి వెలిగించి ఉత్సవాలు ప్రారంభించి మాట్లాడారు. స్వామి వివేకానంద బోధనలతో సరైన సమయంలో సరైన మార్గనిర్దేశకం లభిస్తుందన్నారు. నేటి వివేకానందను ఆదర్శంగా తీసుకొని లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. అంతకుముందు ట్యాంక్‌బండ్‌పై వివేకానంద విగ్రహానికి ఐపీఎస్ అధికారి సౌమ్య మిశ్రా పూలమాల వేసి నివాళులర్పించారు. రామకృష్ణ మఠం సిబ్బంది అవేకింగ్ ఇండియా పేరుతో ట్యాంక్‌బండ్ నుంచి యువతీ యువకులు రామకృష్ణ మఠం వరకు వాక్ నిర్వహించారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎం రమేష్‌రాం తదితరులు

స్వచ్ఛంద సంస్థలు పేదలను ఆదుకోవాలి

కవాడిగూడ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి నిరుపేదలను, అనాథలను ఆదుకోవాలని బీజేపీ ముషీరాబాద్ నియోజక వర్గ కన్వీనర్ ఎం. రమేష్‌రాం కోరారు. గాంధీనగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో గాంధీనగర్ ఆర్యవైశ్య సంఘం సభ్యులు గౌరయ్య, మల్లేషం, నాగభూషణం, వైకుంఠం, రమేష్‌గుప్తా, రాజు, శివ, కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వడ్డె ఓబన్న జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

వడ్డెరుల అభివృద్ధికి సహకారం అందించాలి

రాంనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వడ్డెరుల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సహకారం అందించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న 217వ జయంతి ఉత్సవం జరిగింది. ముఖ్యఅతిథులుగా బీసీ సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ డి.చంద్రశేఖర్, వడ్డెర ఫెడరేషన్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డిలు హాజరై ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వడ్డె ఓబన్న మునిమనువడు మంజుల బాలనర్సింహుడు రచించిన 'వడ్డె ఓబన్న జీవిత చరిత్ర' పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నిర్వాహక సంస్థ చైర్మన్ సత్యనారాయణ, వైస్‌చైర్మన్ ఎత్తిరి అంతయ్య, శివరాత్రి ఐలమల్లు, డి.రాజ్యలక్ష్మి, ఎత్తిరి మారయ్య, ఓర్సు కృష్ణయ్య, ఎం.వెంకటేశ్, వల్లెపు వెంకటేష్, శివ భూపతి, హన్మంతు, యాదయ్య, సుధాకర్, లింగయ్య, ముత్యాలు పాల్గొన్నారు.



ప్రైవేట్ జూనియర్ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కార్యవర్గం

తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉమాశంకర్

బర్కత్‌పుర, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని బర్కత్‌పురలోని రత్న కళాశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా వి.ఉమాశంకర్, ప్రధాన కార్యదర్శిగా పి.సుధాకర్‌రెడ్డి, కోశాధికారిగా సి.పి.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా అహ్మద్ హుస్సేన్, ఎం.డి.ఉస్మాన్, సంయుక్త కార్యదర్శిగా సిద్ధిఖీ, కార్యవర్గ సభ్యులుగా ఎం.డి.అక్రమ్‌షేక్ హైదర్, సలహాదారులుగా వి.హనుమంతరావు, డాక్టర్ ఎస్.శ్రావణ్‌కుమార్‌లు ఎన్నికయ్యారు. అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ నోటిఫికేషన్ ఇవ్వకముందే కొన్ని కళాశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని, వీటిని వెంటనే నిలిపివేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

జూనియర్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్ష్మయ్య

చిక్కడపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా బి. మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎం. పర్వాతాలు గౌడ్ ఎన్నికయ్యారు. అధ్యక్షుడు బి.లక్ష్మయ్య మాట్లాడుతూ హైస్కూల్‌లో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లకు ప్రమోషన్ ద్వారా జూనియర్ కాలేజీలో పీడీలగా అవకాశం ఇవ్వాలని కోరారు.

ఆర్‌బీవీఆర్ కళాశాలను సందర్శించిన న్యాక్ బృందం

బర్కత్‌పుర, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బర్కత్‌పురలోని రాజ్‌బహదూర్ వెంకట్రామ్‌రెడ్డి (ఆర్‌బీవీఆర్) కళాశాలను నేషనల్ అసిస్‌మెంట్ ఫర్ అక్రిడేషన్ కౌన్సిల్ (ఎన్‌ఏఏసీ) బృందం సందర్శించింది. రెడ్డి కళాశాలలో డిగ్రీ, పీజీ కోర్సులు బాలికలకు అందుబాటులో ఉన్నాయి. గ్రేడింగ్ కోసం న్యాక్ బృందం ఈ కళాశాలను సందర్శించింది. కళాశాలలో విద్యాబోధన, మౌలిక సదుపాయాలు, వసతులు, గ్రంథాలయం, ల్యాబ్స్ తదితర అన్నింటినీ న్యాక్ బృందం పరిశీలించింది. రెండు రోజుల పాటు ఈ బృందం ఈ కళాశాలను సందర్శించనున్నది. న్యాక్ బృందానికి కళాశాల గౌరవ కార్యదర్శి ప్రొఫెసర్ ముత్యంరెడ్డి, కళాశాల కరస్పాండెంట్ ప్రొఫెసర్ సుదర్శన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్యుతదేవిలు స్వాగతం పలికారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు రికవరీ బాధితులకు అందజేత

చిక్కడపల్లి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వేర్వేరు సందర్భాల్లో ప్రజలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసిన పోలీసులు, వాటిని బాధితులకు అందజేశారు. రెండు నెలల కిందట చిక్కడపల్లికి చెందిన సింగారపురాణి సెల్‌ఫోన్ పోయింది. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇన్‌స్పెక్టర్ సీతయ్య పర్యవేక్షణలో క్రైమ్ కానిస్టేబుల్ ప్రశాంత్ దర్యాప్తు చేపట్టారు. దాదాపు 30 సెల్‌ఫోన్లు రికవరీ చేసి గురువారం బాధితులకు అందజేశామని ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడి మృతి



మృతిచెందిన యువకుడు

బర్కత్‌పుర, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం. ఫలక్‌నామా - బుద్వేల్ రైల్వే స్టేషన్ల నడుమ 35 ఏళ్ల గుర్తు తెలియని యువకుడు పట్టాలు దాటుతుండగా కాచిగూడ గుంతకల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుడిభుజంపై త్రిశూలం, ఎడమ భుజంపై నాగుపాము పచ్చబొట్టు ఉంది. చనిపోయిన వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే 87126 58584 ఫోన్ నెంబర్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ కళాశాలలో భోగి మంటలు వేస్తున్న కళాశాల చైర్మన్, ఎమ్మెల్యే జి.వినోద్ తదితరులు



బాకారంలోని పాఠశాలలో ముగ్గులువేస్తున్న విద్యార్థినులు



విద్యార్థులు ఏర్పాటు చేసిన పాడిపంటల ఎగ్జిబిషన్



కుండలపై పెయింటింగ్ చేస్తున్న విద్యార్థులు

సంక్రాంతి శోభ

పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు

- భోగి మంటలు, సాంస్కృతిక కార్యక్రమాలు
- అంబేడ్కర్ కాలేజీలో వేడుకలు ప్రారంభించిన ఎమ్మెల్యే వినోద్
- నిజాం కళాశాలలో విద్యార్థులు, బాలికల ఫ్యాషన్ షో
- సందడి చేసిన ప్రముఖ సినీ దర్శకుడు శేఖర్ కొమ్ముల

రాంనగర్/కవాడిగూడ/బర్కత్‌పుర/అంబర్‌పేట / జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలోని ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, బస్తీల్లో వివిధ కుల సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి సంబరాలు జరుపుకొన్నారు. ముగ్గుల పోటీలు, భోగీ మంటల కార్యక్రమాలు నిర్వహించారు. కాలేజీలు, పాఠశాలల్లో విద్యార్థులకు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విద్యాసంస్థలలో ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకల కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్, ఎమ్మెల్యే జి.వినోద్, ప్రిన్సిపాల్, డైరెక్టర్లు ప్రారంభించారు. నిజాం కళాశాలలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా నిర్వహించిన కల్చరల్ ఫెస్ట్ అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థుల నృత్యాలు, పతంగుల ఎగిరివేత, ఫ్యాషన్ షోతో నిజాం కళాశాల హోరెత్తింది. నిజాం కళాశాలలో గురువారం సంక్రాంతి కల్చరల్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రంగోలి పోటీలు, కుండల డిజైన్, కైట్స్ మేకింగ్, ఫేస్ పెయింటింగ్, ఫ్యాషన్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఫుడ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. వివిధ రకాల సంక్రాంతి వంటకాలను విద్యార్థులు రుచిచూశారు. ప్రత్యేక స్టాల్స్ దుస్తులు, కాస్మోటిక్ షాపులను ఏర్పాటు చేశారు. కల్చరల్ ప్రోగ్రామ్‌లో నగరంలోని పది కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. నిజాం కళాశాల విద్యార్థులు, బాలికలు ప్యాషన్ షోలో సందడి చేశారు. ప్రముఖ సినీ దర్శకుడు శేఖర్ కొమ్ముల ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాంనగర్, బాకారం, కవాడిగూడ, అంబర్‌పేట డివిజన్‌లోని ప్రేమ్‌నగర్‌లోని పాఠశాలల్లో సంక్రాంతి సంస్కృతిపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. దాంతో ఆయా ప్రాంతాల్లో సంక్రాంతి శోభ వెల్లివిరసింది. అఖిల భారత సగర మహాసభ ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీలో మహాసభ అధ్యక్షుడు విజయేంద్రసాగర్, ప్రధాన కార్యదర్శి హనుమాన్, కోశాధికారి పార్థసారథి, బీజేపీ నాయకుడు నైషధం సత్యనారాయణ మూర్తి తదితరులు విజేతలకు బహుమతులను అందజేశారు.



డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ కళాశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



ముత్యాల ముగ్గులు



విజేతకు బహుమతి అందజేస్తున్న నల్లకుంట ఎస్ఐ శ్రీనివాస్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న విజయేంద్రసాగర్ తదితరులు



సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు



సంక్రాంతి ఉత్సవాల్లో చిన్నారులు

డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ వ్యవస్థ ఆధునికీకరణకు చర్యలు



నర్సింహబస్తీలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పురాతన డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ వ్యవస్థను ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటున్నామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చెప్పారు. పైపులైన పూర్తయిన తర్వాత ఆ ప్రాంతాల్లో నూతనంగా సీసీ రోడ్డు పనులు చేపడుతామని అన్నారు. గురువారం డివిజన్‌లోని నర్సింహబస్తీలో నూతనంగా జరుగుతున్న రోడ్డు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. నర్సింహబస్తీలోని ఇంటింటికి వెళ్లి ప్రజలెదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీలో రోడ్డు పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల అభ్యర్థన మేరకు ముందుగా డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేయిస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రోహిత్, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం: కాలేరు

అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చెప్పారు. నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్‌లోని ఎంఆర్‌సీ చికెన్ సెంటర్ పక్క వీధిలో చెట్టు కూలి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా, ఆ ప్రాంతాన్ని సందర్శించారు. డీఆర్‌ఎఫ్, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిని రప్పించి కూలిన చెట్టును తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరింపజేశారు. సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

అజ్మీర్ దర్గాకు చాదర్ సమర్పణ



చాదర్‌ను పరిశీలిస్తున్న కేటీఆర్

ముషీరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ బీఆర్‌ఎస్ నాయకుడు అక్లక్ హుస్సేన్ ఆధ్వర్యంలో ముస్లింలు అజ్మీర్ దర్గాను దర్శించుకొని గురువారం చాదర్ సమర్పించారు. అంతకు ముందు వారు మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆయన నివాసంలో కలవగా, చాదర్‌ను పరిశీలించిన కేటీఆర్ వారితో కలిసి ప్రార్థనలు చేశారు. ప్రతి సంవత్సరం అజ్మీర్ దర్గాకు భారీ చాదర్‌ను సమర్పిస్తామని అక్లక్ హుస్సేన్ తెలిపారు. కార్యక్రమంలో అక్బర్ అలీ, మున్వర్ అలీ, అతిక్‌ఉర్ రహెమాన్, సైఫ్ ఉద్దీన్, జాహెద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిషనర్‌కు అభినందన



కమిషనర్ కృష్ణ ఆదిత్యకు శుభాకాంక్షలు చెబుతున్న జాసన్

చిక్కడపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కార్మిక కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న కృష్ణ ఆదిత్యను రాష్ట్ర అసిస్టెంట్ లేబర్ కమిషనర్స్ సంఘం అధ్యక్షులు బి. జాసన్, కార్యదర్శి జీబీఎన్ స్వామి గురువారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి అభినందించారు. ఏసీఎల్‌లు వెంకట్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకటరమణ, గౌరవ కార్యదర్శి చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



ఖైరతాబాద్ జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టర్లు

రూ.1200 కోట్ల బకాయిలను చెల్లించండి

- మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంట్రాక్టర్ల నిరసన

ఖైరతాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న రూ.1200 కోట్ల బకాయిలను జీహెచ్‌ఎంసీ వెంటనే విడుదల చేయాలని జీహెచ్‌ఎంసీ చిన్నకాంట్రాక్టర్లు డిమాండ్ చేశారు. గురువారం ఖైరతాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంట్రాక్టర్లు నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమేష్, నాసర్ అలీఖాన్ మాట్లాడారు. జీహెచ్‌ఎంసీలో దాదాపు 3వేల మందికి పైగా కాంట్రాక్టర్లకు బిల్లులు అందకపోవడంతో తమతో పాటు తమపై ఆధారపడ్డ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కో కాంట్రాక్టర్ కింద దాదాపు 20 కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని వాపోయారు. పెద్ద కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లిస్తూ చిన్న కాంట్రాక్టర్ల బిల్లులను నిలిపివేయడంతో తమ మనుగడే ప్రశ్నార్థకంగా మారిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సంక్రాంతి లోపు తమ బిల్లులను విడుదల చేయకపోతే పనులను ఎక్కడికక్కడే నిలిపివేస్తామని వారు హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఆరిఫ్ అహ్మద్, లక్ష్మయ్య, పి.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాని కావడం ఖాయమని ఆయన అన్నారు. గురువారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో నిర్వహించిన సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని నాంపల్లి నియోజకవర్గం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాంపల్లి నియోజకవర్గంలో బీజేపీకి అత్యధికంగా ఓట్లు వచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, నాయకులు రాహుల్ చంద్ర, పవన్‌కుమార్, సుమంత్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

'సూపర్ మ్యాక్స్' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సీఎం రేవంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

రాంనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సూపర్ మాక్స్ కంపెనీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో చర్చించి పరిష్కారానికి చర్యలు చేపడతామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ఆ కంపెనీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శ్రీనివాస్‌రెడ్డి గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్మికులు రెండేళ్లుగా తమ డిమాండ్ల కోసం రిలే నిరాహారదీక్ష చేస్తున్నారని, కంపెనీ యాజమాన్యం నిర్లక్షం వల్ల 275 కార్మికుల కుటుంబాలు రోడ్డునపడ్డాయని సీఎంకు వివరించామన్నారు. స్పందించిన సీఎం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారని ఆయన తెలిపారు.

నేటి నుంచి మల్లన్న జాతర మహోత్సవాలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అంజిరెడ్డి దంపతులు

ముషీరాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ బాకారంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి (మల్లన్న) జాతర మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి తెలిపారు. గురువారం జాతర మహోత్సవ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ముఖ్యఅతిథులుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి హాజరవుతారని తెలిపారు.

మహిళలకు స్ఫూర్తి ప్రదాత సరోజినీదేవి



మాట్లాడుతున్న శ్రీదేవి, పక్కన కళా జనార్దన మూర్తి

చిక్కడపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చిన్ననాటనే ఝాన్సీ లక్ష్మీబాయి వంటి మహిళా పోరాట యోధుల జీవిత చరిత్రలతో ప్రేరణ పొంది, మహాత్మ గాంధీజీ పిలుపుతో దేశస్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న సరోజినీ దేవి నేటి మహిళలకు స్ఫూర్తి ప్రదాత అని అధికార భాషా సంఘం మాజీ చైర్మన్ మంత్రి శ్రీదేవి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో గురువారం దశాబ్దిపూర్వ మహనీయుల యాదిలో భాగంగా సరోజనీ నాయుడు సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. మంత్రి శ్రీదేవి మాట్లాడుతూ ఆనాడే కుల రహిత సమాజంకోసం కృషి చేసిన సరోజినీ దేవి తాను ఇతర కులం వారిని వివాహం చేసుకుని ఆదర్శంగా నిలిచారని వివరించారు. గాంధీజీ ఉప్పు సత్యాగ్రహంలో ముందు వరుసలో నిలిచిన సరోజినీ.. తాను వ్యతిరేకించిన అంశాలను నిర్భయంగా నెహ్రూ వంటి వారితో చర్చించగల ధీరోదాత్త మహిళఅని వివరించారు. కథక్ కళాకారుడు అంజిబాబు, కవి చిక్కా రామదాసు, గీతా దేవి పాల్గొన్నారు.

పార్కు చేసిన వాహనాల చోరీ

- విడి భాగాలుగా విక్రయం
- విక్రేతలు, కొనుగోలు దారుల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాల విడిభాగాలు, అదుపులో నిందితులు

రాంనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు దొంగిలించి వాటి విభాగాలను వేరు చేసి విక్రయిస్తున్న ముగ్గురిని, వాటిని కొనుగోలు చేస్తున్న మరో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ముషీరాబాద్ సీఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... భోలక్‌పూర్‌కు చెందిన మోబీన్‌పాషా, మహ్మద్ ముస్తాఫా, మహ్మద్ ఇంతియాజ్‌లు కొంత కాలంగా ద్విచక్రవాహనాలకు దొంగతనానికి పాల్పడుతున్నారు. వాటి విడి భాగాలను మహ్మద్ రిజ్వాన్, అక్బార్ హుస్సేన్‌లు విక్రయించారు. నిఘా పెట్టిన పోలీసులు మొత్తం ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటరెడ్డి తెలిపారు.

మా ఫ్యామిలీ చెట్టుపై ఉంది...

- భారీ చెట్టు ఎక్కి యువకుడి హల్‌చల్



చెట్టుపై హల్‌చల్ చేస్తున్న యువకుడు

బౌద్ధనగర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): 'మా ఫ్యామిలీ చెట్టుపై ఉంది..' అంటూ ఓ యువకుడు భారీ చెట్టు ఎక్కి హల్‌చల్ చేశాడు. సుమారు రెండు గంటల పాటు పోలీసులను ముప్పుతిప్పలు పెట్టాడు. డీఆర్‌ఎఫ్, ఫైర్ సిబ్బంది, పోలీసులు అందరూ కలిసి అతడిని అతికష్టం మీద కిందికి దించారు. అతడి మాటలను బట్టి మతిస్థిమితం లేనట్లుగా గుర్తించారు. ఈ సంఘటన గురువారం మధ్యాహ్నం చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ మట్టంరాజు, అడ్మిన్ ఎస్సై బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అమర్‌టాకీస్ గల్లీ వద్ద ఓ యువకుడు అతిపెద్ద చెట్టు ఎక్కి, ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు చిలకలగూడ పోలీసులకు సమాచారమందింది. ఇన్‌స్పెక్టర్ మట్టంరాజు, అడ్మిన్‌ఎస్సై బాలరాజు సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకున్నారు. చెట్టు దిగమంటూ అతడిని కోరారు. చెట్టుపై ఉన్న యువకుడు ఏదేదో మాట్లాడుతున్నాడు. అతడిని మాటల్లో పెట్టి డీఆర్‌ఎఫ్, ఫైర్ సిబ్బంది క్రేన్ సహాయంతో కిందికి దించారు. వివరాలు అడిగితే తనపేరు రబీందర్, చత్తీస్‌గఢ్ అని చెప్పాడు. చెట్టు ఎందుకు ఎక్కావు అంటే తమ ఫ్యామిలీ చెట్టుపై ఉందంటూ ఇది నాగపూర్ కాదా.. అని పోలీసులను ప్రశ్నించాడు. పోలీసులు యువకుడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతడిని చాకచక్యంగా కిందికి దించిన సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

నర్సింగ్‌రావు సేవలు చిరస్మరణీయం: వక్తలు

రాంనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టు నర్సింగ్‌రావు సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం రాంనగర్‌లోని రాజ్‌ఫంక్షన్ హాల్‌లో ముషీరాబాద్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల మరణించిన సీనియర్ జర్నలిస్టు ఎర్రం నర్సింగ్‌రావు సంతాప సభ జరిగింది. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, మాజీ కార్పొరేటర్లు వాజీద్ హుస్సేన్, వి.శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రామ్, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, టీజేఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య, న్యూడెమోక్రసీ నాయకులు ఎస్.వెంకటేశ్వర్‌రావు, కె.గోవర్ధన్, ఎం.శ్రీనివాస్, అరుణోదయ విమలక్క, జర్నలిస్టు సంఘం రాష్ట్ర నాయకులు మామిడి సోమయ్య తదితరులు నర్సింగ్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దివంగత నర్సింగ్‌రావు అప్పట్లో ఇందిరా పార్కు ధర్నాచౌక్ వేదికగా ప్రజా సమస్యలతో పాటు జర్నలిస్టుల సమస్యలపై పోరాటం చేశారని అన్నారు. ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన కుటుంబాన్ని ఆదుకుంటామని వారన్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | అంజిరెడ్డి : 99859 21362